క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే



కేటీదొడ్డి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ ఆరోగ్య కార్డుల జారీ సర్వే మండలంలోని మైలగడ్డలో మూడో రోజు కొనసాగింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన మైలగడ్డ గ్రామంలో ఐదురోజులు రెండు బృందాలతో ఈ ప్రత్యేక సర్వే నిర్వహిస్తామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు.

రుణాలు అందించండి



గద్వాల: విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రుణాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి కోరారు. శనివారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



మానవపాడు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. శనివారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కొర్విపాడుస్టేజీ, మానవపాడు స్టేజీల వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపరాదని తెలిపారు. పంట పొలాల్లో మద్యం తాగి సీసాలు పగలగొట్టకూడదని, ప్లాస్టిక్ వ్యర్థాలు దూరంగా వేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పకుండా హెల్మెంట్ వాడాలన్నారు.

నేడు బీచుపల్లికి ఎంపీ మల్లురవి రాక

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రానికి ఆదివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని ర్యాలీగా అలంపూర్‌లో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పత్తి రైతుకు సన్మానం



మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన పత్తి రైతు బోయ నరసింహులును శనివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వినూత్న రీతిలో సాగు చేస్తూ అధిక దిగుబడులు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కృష్ణుడు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బోరవెల్లి మాజీ సర్పంచ్ కొండన్న, గిడ్డారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి



ఎర్రవల్లి: ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని తహసీల్దార్ నరేందర్ సిబ్బందితో కలిసి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భీమ్‌సేన్‌రావు, కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.



అయిజ కాళికాదేవి ఆలయంలో..



బీచుపల్లిలో..



అన్నపూర్ణాదేవీగా భవానీ మాత



మల్దకల్‌లో..



ఎర్రవల్లిలో..

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



జములమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



శాంతినగర్‌లో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని శనివారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

■ గద్వాల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో, గద్వాల ఇలవేల్పు జములమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. తాయమ్మ ఆలయంలో, కుమ్మరివీధిలో, అంబభవానీ, వీరభద్రస్వామి, మార్కండేయస్వామి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాల్లో కొలువయ్యారు. - బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శాకాంభరీదేవి అలంకరణలో, ఎర్రవల్లి శివాంజనేయస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు.

■ గట్టులో భవానీమాత శనివారం అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కోట్లగేరిలోని శ్రీకాళికాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలలు చేశారు.

■ మల్దకల్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

■ ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ఆలయంలో మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

■ అయిజ మున్సిపాలిటీలోని కాలమ్మపేటలో అమ్మవారు గాయత్రీదేవిగా, కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వేంకటేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో సింహ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

■ వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులచే పూజలందుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

■ ఉండవెల్లిలోని గాంధీనగర్ కాలనీలో అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంబేడ్కర్ కాలనీలో అమ్మవారి వద్ద హనుమాన్ చాలీసా పారాయణంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వర్లు శర్మ, ఆంజనేయ శర్మ, సురేందరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉండవల్లిలోని గాంధీనగర్‌లో..



ధరూరులో..



శాంతినగర్‌లో..

‘పీఎం కిసాన్’కు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఏఓ సక్రియానాయక్

ఎర్రవల్లి: ఇప్పటి వరకు పీఎం కిసాన్ పథకంలో పేర్లు నమోదు కానీ రైతులు ఎవరైనా ఉంటే తక్షణమే నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం రైతువేదికలో వర్చువల్ పద్ధతిలో నగదు బదిలీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ యోజన పథకంలో నమోదైన రైతుల ఖాతాల్లోకి 18వ విడత నగదును బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తప్పకుండా కేవైసీ, ఆధార్ నెంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, రైతులు లోకారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమేష్, సహదేవుడు, రామాంజనేయులు, పెద్దనర్సింహులు, తదితరులు ఉన్నారు.



కాల్వ అనుకునేరు.. రోడ్డే..

మండల కేంద్రంలోని మాలవీధిలో ఆర్డీఎస్ నీరు పారడంతో రహదారి మొత్తం నిండుకుండలా మారింది. రహదారిపై ప్రయాణించే వాహనదారులు, కాలనీవాసులు నీటిలో విషసర్పాలు అధికంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నుంచి నీటిని మళ్లించాలని కాలనీవాసులు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. - ఉండవెల్లి

‘బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా’

మల్దకల్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఆ పార్టీ గద్వాల జిల్లా నాయకుడు బాసు హన్మంతు అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మల్దకల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. పది నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు గ్రూపులుగా విడిపోయి అభివృద్ధి పట్టించుకోకుండా.. స్వార్థానికి పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని ఆయన పార్టీ కార్యకర్తలకు భరోసానిచ్చారు. అంతకు ముందు ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌నాయుడు, మోనేష్, బస్వరాజు, రాము, పటేల్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పారితోషకం ఇస్తేనే అదనపు పనులు

పాన్‌గల్: పారితోషకం ఇస్తేనే అదనపు పనులు చేస్తామని, లేకుంటే పనులు చేయలేమని ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

గద్వాల అర్బన్: అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నడిగడ్డహక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి మండలాలు ఆసియా ఖండంలోనే విద్యలో అత్యంత వెనుకబడిందని తెలిపారు. ఆయా మండలాల్లోని పాఠశాలల్లో సరైన ఉపాధ్యాయులు లేరని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో బాల కార్మికులు పెరుగుతున్నారని, దీనిపై దృష్టి సారించాలని, విద్యపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, శ్రీనివాస్‌యాదవ్, రంగస్వామి, ప్రేమ్‌రాజ్, ఆంజనేయులు, రమేష్ తదితరులు ఉన్నారు.

సమయపాలన మరిచారు..



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ



ధరణి ఆపరేటర్ కుర్చీ



ఖాళీగా రెవెన్యూ సిబ్బంది కుర్చీలు

మానవపాడు: అధికారులు సమయపాలన పాటించకపోవడంతో పనులు కావడం లేదని, తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి ఇలా ఉంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 11గంటలైనా తహసీల్దార్, సిబ్బంది కార్యాలయానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, ప్రజలు వివిధ పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువైయారని వాపోతున్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలలో



ధరూర్‌లో బతుకమ్మ సంబరాలలో విద్యార్థినులు



బతుకమ్మలతో ఎమ్మెల్యే సతీమణి జ్యోతి

గద్వాలటౌన్: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ బతుకమ్మను విద్యార్థినులు కీర్తించారు. శనివారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి బతుకమ్మ వేడుకలకు హాజరై విద్యార్థినులు, అధ్యాపకులతో కలిసి బొడ్డెమ్మలు ఆడారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రీనా, ఏఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. కాలేజీకి సోమవారం నుంచి దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రత్యేకంగా తయారు చేసిన బతుకమ్మలను విద్యార్థులు నెత్తిన ఎత్తుకుని గ్రామంలోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి బతుకమ్మ పాటలకు నృత్యం చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి, పూజలు చేశారు. అందరూ కలిసి బతుకమ్మ పాటలకు బొడ్డెమ్మలు వేశారు. అనంతరం బతుకమ్మలను దేవుని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలోని శ్రీగంగె వెంకట కృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మన్నరావు ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో బతుకమ్మ పాటల నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో లెక్చరర్లు వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మహేందర్‌గౌడ్, బాలకృష్ణ, ప్రశాంతి, బ్రహ్మయ్య, తులశమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో బతుకమ్మ వేడుకల్లో సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు



గద్వాల నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలలో విద్యార్థినులు



మానవపాడు కళాశాలలో..

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్

కొత్తకోట రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను శనివారం పట్టణంలోని 1వ వార్డులో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నార ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్‌జే.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, క్రాంతికుమార్, నారాయణ, మహేష్, శ్యామ్, పి.రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొన్న ట్రాలీ ఆటో

కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం తెల్లవారుజామున పాలెం బైపాస్ ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి 9 గంటలకు నంద్యాల నుంచి పాత ఫ్రిజ్‌ల లోడ్‌తో ట్రాలీ ఆటో హైదరాబాద్ బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట పాలెం బైపాస్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో.. ట్రాలీ ఆటో లారీని వెనక నుంచి ఢీకొట్టింది. ఘటనలో ఆటో డ్రైవర్ కృష్ణకు స్వల్ప గాయాలు కాగా.. పక్క సీట్లో కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన రాజును వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.